ప్రజాశక్తి
బుధవారం 10 జనవరి 2024
5
శ్రీ సత్యసాయి



ఎస్మాతో బెదిరింపులా..?



పుట్టపర్తి పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

- హామీలను అమలు చేయాలనే అడుగుతున్నాం..
- బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరు
- ఐక్య కార్మిక సంఘాల నాయకులు
- పుట్టపర్తిలో జైల్ భరో విజయవంతం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే వాటిని పరిష్కరించకుండా ఎస్మా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు దిగడం దుర్మార్గమని ఐక్య కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. అంగన్వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని వారి సమ్మెకు మద్దతుగా పలు ప్రజాసంఘాల నాయకులు చేపట్టిన జైలుభరో కార్యక్రమం విజయవంతమైంది. మంగళవారం ఉదయం ఆర్డీవో కార్యాలయం నుంచి గణేష్ సర్కిల్, గోకులం మీదుగా పట్టణ పోలీస్ స్టేషన్ వరకు ప్రదర్శన కొనసాగింది. అక్కడ ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆందోళనకారులను పట్టణ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌లో ఉంచారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఇంతియాజ్ మాట్లాడుతూ అంగన్వాడీలు, సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సమ్మెలోకి దిగారన్నారు. ప్రభుత్వం ఈ ఆందోళనలను నిరంకుశంగా నియంతత్వంగా అణచివేయడానికి ప్రభుత్వం పూనుకుందన్నారు. అణచివేతలు నిర్బంధాలు చేసినంత మాత్రాన ఉద్యమాలు ఆగవని హెచ్చరించారు. అంగన్వాడీలు లక్షలాది మందికి పైగా పిల్లలు, మహిళలు, గర్భిణులకు సేవలు అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తెలంగాణ కన్నా వెయ్యి రూపాయలు అదనంగా వేతనం పెంచుతామని గతంలో హామీ ఇచ్చారని దానిని అమలు చేయాలని కోరుతుంటే పట్టించుకోక పోవడం దుర్మార్గం అన్నారు. హామీని నెరవేర్చాలని సమ్మె చేస్తున్న వారిపై జగన్ ప్రభుత్వం నియంతత్వంగా వ్యవహరించి ఎస్మాను తెవేడం అప్రజాస్వామికం అన్నారు. కనీస వేతనం ఇవ్వాలని, గ్రాట్యుటీ చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా దుర్మార్గంగా ఉందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లుగా పిలిచే వారు కార్మికుల కిందికే వస్తారని ఎస్మాను ఎలా ప్రయోగిస్తారని ప్రశ్నించారు. అంతకుముందే అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టి 5వ తేదీలోగా విధుల్లో చేరాలని లేకుంటే తొలగిస్తామని నోటీసులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీలను నోటీసుల ద్వారా బెదిరించడం వల్ల ఎవరూ భయపడరన్నారు. ప్రభుత్వం సంక్రాంతిలోగా వారి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాజకీయ పార్టీలన్నీ ప్రత్యక్ష కార్యాచరణకు పూను కుంటాయన్నారు. ఇదే జరిగితే భవిష్యత్తు పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మరోవైపు మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 15వ రోజుకు చేరుకుందని ఆ కార్మికుల సమస్యల పరిష్కారంపైనా కూడా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం స్పందించేంత వరకు ఈ సమ్మె కొనసాగు తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెద్దన్న, బడా సుబ్బిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పెద్దన్న, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ దిల్షాద్‌బీ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, అంగన్వాడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.శ్రీదేవి, కోశాధికారి సిఎస్.శ్రీదేవి, ప్రాజెక్టు నాయకులు బాబమ్మ, జయమ్మ, లక్ష్మీదేవి, రమణమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'మెట్టు' వైపే మొగ్గు..!

- రాయదుర్గం వైసిపి ఇన్‌ఛార్జి ఆయనకే
- కాంగ్రెసు వైపు కాపు చూపు..?
- సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డితో మంతనాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి


మెట్టు గోవిందరెడ్డి


ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వైసిపికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించడంతో అక్కడ కొత్తగా నియోజకవర్గ సమన్వయకర్త ఎవరన్న చర్చ నడుస్తోంది. మాజీ ఎమ్మెల్యే మెట్టుగోవిందరెడ్డిని నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించే అవకాశాలున్నట్టు ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. 2019 ఎన్నికలకు ముందు టిడిపి నుంచి వైసిపిలోకి మెట్టుగోవిందరెడ్డి చేరారు. ఆ తరువాత ఆయనకు ఎపిఐఐసి ఛైర్మన్ పదవినిచ్చారు. ప్రస్తుతం ఆయన ఎపిఐఐసి ఛైర్మన్‌గానున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాపు రామచంద్రారెడ్డి స్థానంలో మెట్టుగోవిందరెడ్డిని సమన్వయకర్తగా నియమించే అవకాశముందని భావించారు. ఇప్పుడు ఎమ్మెల్యేగానున్న కాపును కళ్యాణదుర్గంకు మార్పు చేస్తారని ఊహాగానాలు విన్పించాయి. అక్కడ ఆయన్ను నియమించకపోవడంతో పార్టీకి రాజీనామా చేసి బయటకు వెళ్లిపోయారు. ఆయన స్థానంలో ఇంకా వైసిపి రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తను నియమించలేదు. ఒకటి,రెండు రోజుల్లో నియమించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. వైసిపికి కొత్త సమన్వయకర్తగా మెట్టుగోవిందరెడ్డి ఉండే అవకాశాలే ఎక్కువగానున్నాయి. వైసిపిని వీడిన సందర్భంలో కాపు రామచంద్రారెడ్డి స్వతంత్రంగా పోటీ చేస్తానని ప్రకటించారు. అయితే ఆయన కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది. మంగళవారం నాడు సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డిని భార్య కాపు భారతితో పాటు వెళ్లి కలిశారు. వైసిపి టిక్కెట్టు ఇవ్వకున్నా రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో పోటీ చేసి తీరుతామని కాపు ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో రఘువీరారెడ్డిని కలువడంతో ఆయన కాంగ్రెసు వైపు వెళ్తున్నారా అన్న చర్చ నడుస్తోంది. ఇప్పటికే వైసిపిని వీడిని అనేక మంది నాయకులు కాంగ్రెసులో చేరుతామని ప్రకటించారు. ఈయన కూడా అటు వైపే వెళ్లే అవకాశాలున్నాట్టు తెలుస్తోంది.


కాపు రామచంద్రారెడ్డి

2009లో కాపు రామచంద్రారెడ్డి కాంగ్రెసు పార్టీ నుంచి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణం తరువాత వైసిపి ఏర్పాటుతో కాంగ్రెసు పార్టీ, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వైసిపిలో చేరారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వెంట నడిచిన 12 మంది ఎమ్మెల్యేల్లో ఈయన ఒకరుగానున్నారు. ఆ తరువాత 2012లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ గెలుపొందారు. ఆ తరువాత 2014లో వైసిపి తరుపునే పోటీ చేసి ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో మరోమారు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇప్పుడు వైసిపి నుంచి బయటకొచ్చి తిరిగి పాత గూటికే చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్.రఘువీరారెడ్డి ద్వారా అయితే అటు కర్నాటక రాజకీయాల్లోనూ అవకాశం లభిస్తే వెళ్లేందుకు వీలుంటుందన్న ఉద్దేశంతోనే ఆయన్ను కలిసినట్టు రాజకీయవర్గాలు చర్చ నడుస్తోంది. ఎందుకంటే కాపు రామచంద్రారెడ్డికి కర్నాటకలో పలువురితో సత్సంబంధాలున్నాయి. దీనికి రఘువీరారెడ్డి మద్దతు కూడా లభిస్తే అవకాశాలు అటువైపు కూడా మెరుగుపడవచ్చునన్న ఉద్ధేశంతోనే కాంగ్రెస్‌లోకి వెళ్లే యోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. కర్నాటకలో ప్రస్తుతం కాంగ్రెసు పార్టీ అధికారంలో ఉంది. ఇక్కడ పార్టీ రాకపోయినా అటు వైపు వెళ్తే కొంత ప్రయోజనం చేకూరే అవకాశాలూ ఉంటాయన్న ఆలోచనతోనే కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నట్టు రాజకీయవర్గాలు భావిస్తున్నాయి.

ఇంకెంతమంది ప్రాణాలు బలి తీసుకుంటారు..!

ఎస్ఎస్ఎ ఉద్యోగుల సూటిప్రశ్న



మృతుని చిత్రపటంతో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా ఎంతమంది ఉద్యోగస్తుల ప్రాణాలను తీసుకుంటారని శ్రీ సత్యసాయి జిల్లా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జేఏసీ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం 21వ రోజు సమ్మెలో భాగంగా పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఓబిరెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 20వ తేదీ నుండి సమ్మెలోకి వచ్చిన సమగ్ర శిక్ష ఉద్యోగుల్లో ఒకరి ప్రాణాన్ని ప్రభుత్వం బలి తీసుకొందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అని అన్నారు. అనకాపల్లి జిల్లా మునగపాక మండల విద్యాశాఖ కార్యాలయంలో 19సంవత్సరాల నుండి పని చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ జడ్డు వాసుదేవరావు సమ్మెలో పాల్గొని 9రోజుల కిందట తీవ్ర ఒత్తిడికి గురై మంగళవారం మృతిచెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు రాష్ట్ర పథక అధికారి శ్రీనివాసరావు బాధ్యత వహించాలన్నారు. వాసుదేవరావు మృతికి సంతాపసూచకంగా శిబిరంలో కొంతసేపు మౌనం పాటించారు. ఇప్పటికైనా ప్రభుత్వ మొండివైఖరి విడనాడి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, జేఏసీ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి, గోరంట్ల, నల్లచెరువు ఉపాధ్యాయ సంఘం జేఏసీ నాయకులు సుధాకర్ రెడ్డి, చాంద్‌బాషా, దామోదర్ రెడ్డి, లక్ష్మీపతి రెడ్డి సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాగరాజు, రవి, ఓబులేసు, హరిప్రసాద్ , స్రవంతి, ఈశ్వరి, ఆనంద్, రాజశేఖర్, కృష్ణమూర్తి, క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

'పురం'లో రాజకీయవేడి..!

సమావేశాలతో మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే బాలకృష్ణ బిజీబిజీ

ప్రజాశక్తి-హిందూపురం





హిందూపురంలో రాజకీయ వేడి మొదలైంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు సమావేశాలు, బహిరంగ సభలతో ఎన్నికల కాకను పుట్టిస్తున్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మూడో రోజు నాడు మంగళవారం టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరో వైపు రెండో రోజు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హిందూపురం రూరల్ మండలంలోని ఏడు పంచాయతీల పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే బాలకృష్ణ ఒకే సారి హిందూపురంపై దృష్టి సారించారు. వైనాట్ హిందూపురం టార్గెట్‌తో పెద్దిరెడ్డి ఆపరేషన్ మొదలు పెట్టారు. మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలన్న లక్ష్యంతో నియోజకవర్గంలో బాలకృష్ణ పర్యటిస్తున్నారు. హిందూపురం ఉమ్మడి అనంతపురం జిల్లాలో పొలిటికల్ హాట్‌స్పాట్‌గా మారింది. నాలుగు దశాబ్దాలుగా టీడీపీకి కంచుకోటగా ఉన్న హిందూపురంలో బాలయ్యకు పోటీగా తెరపైకి దీపికా రెడ్డిని వైసిపి తీసుకొచ్చింది. తీసుకురావడమే కాదు బోణీ కొడుతామంటూ మిషన్ హిందూపూర్ పేరుతో రాజకీయ కార్యచరణ ప్రారంభించారు. సీఎం జగన్ ఆదేశాలతో మిషన్ హిందూపూర్ బాధ్యతలను మంత్రి పెద్దారెడ్డి భుజానికెత్తు కున్నారు. వ్యూహాత్మకంగా దీపికరెడ్డిని తెరపైకి తీసుకొచ్చారాయన. ఆమెతో పాటు ఇటీవల ప్రకటించిన హిందూపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి శాంతమ్మతో కలిసి ప్రజల్లోకి వెళ్తున్నారు. ప్రతి గ్రామ పంచాయితీకి వెళ్లి సమావేశాలను ఏర్పాటు చేసి అందరికీ వారిద్దరినీ పరిచయం చేస్తున్నారు. మరోవైపు హిందూపురంలో టీడీపీ సందడి కూడా పెరిగింది. హ్యాట్రిక్ పక్కా అన్న ధీమాతో ఆ పార్టీ నేతలు ముందుకెళ్తున్నారు. ఎమ్మెల్యే బాలయ్య హిందూపురంపై ఫోకస్ పెట్టి ఆ పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరో రెండు రోజులపాటు హిందూపురంలోనే ఆయన మకాం వేయనున్నారు ఇద్దరి నేతలు సమావేశాలు నిర్వహిస్తూనే నాయకులను పక్క పార్టీ వైపు వెళ్లకుండా నిలువరించే ప్రయత్నం చేస్తున్నారు.

జాతీయ యువజనోత్సవాలకు 'బాలయేసు' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-హిందూపురం

జాతీయ యువజనోత్సవాలకు పట్టణంలోని బాలయేసు విద్యాసంస్థకు చెందిన విద్యార్థి ఎంపిక అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయావుల్లా ఖాన్ తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థి జశ్వంత్ కుమార్‌ను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 2024 జనవరి 12 నుండి 15 వరకు మహారాష్ట్ర నాసిక్ లో జరిగే జాతీయ యువజన ఉత్సవాలకు శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం తరపున కళాశాలకు చెందిన జశ్వంత్ కుమార్ ఎంపిక అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మురళీధర రావు, పోగ్రాం అధికారులు అశ్వర్థ నారాయణ, హరీష్ అధ్యాపకులు పాల్గొన్నారు.

మంత్రి వ్యాఖ్యలు సరికాదు

ప్రజాశక్తి - పెనుకొండ

మంత్రి ఉషశ్రీ చరణ్ పెనుకొండలో సోమవారం చేసిన వ్యాఖ్యలను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ ఖండించారు..మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రశాంతంగా ఉండే పెనుకొండలో మంత్రి ఉషశ్రీ చరణ్ వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారే ప్రమాదం ఉందన్నారు. మంత్రి ఉషశ్రీ చరణ్ అభివృద్ధి చేసి ఉంటే కళ్యాణదుర్గం నుండి పోటీచేయవచ్చుకదా అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ వైఖరికి ఆపార్టీ నాయకులు విసిగి వేసారి పోయారన్నారు. ఇప్పుడు పెనుకొండకు వచ్చిన మంత్రి ఉషశ్రీ ఆటలు సాగవని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవ నాయుడు, వెంకట రమణ, సూర్యనారాయణ, ఆంజనేయులు, సోము, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మారుతున్న రాజకీయాలు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ఎన్నికల వేడి ఊపందుకున్న నేపథ్యంలో వైసిపిలో ముసలం మొదలైంది. నేడో రేపో మూడవ జాబితా వెల్లడి కానున్న సమయంలో అసమ్మతి రాగం అదే స్థాయిలో ఊపందుకుంది. ప్రధానంగా శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి నియోజకవర్గం సంబంధించి సిట్టింగ్ ఎమ్మెల్యే దుద్ద కుంట శ్రీధర్ రెడ్డికి వ్యతిరేకంగా అసమ్మతి నాయకులు ఒక్కటై అధిష్టానానికి తమ నిర్ణయాన్ని తెలియజేయడం సర్వత్రా చర్చకు తెర లేపింది. సిట్టింగ్ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి తిరిగి టికెట్ ఇస్తే తాము ఎవరు కూడా పార్టీ కోసం గానీ ఆయన గెలుపు కోసం కానీ పని చేయమంటూ తేల్చి చెప్పారు. ఈ మేరకు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి వ్యతిరేక వర్గీయులు లోచర్ల భాస్కర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, నాగేంద్ర కుమార్ రెడ్డి, పాముదుర్తి ఇంద్రజిత్‌రెడ్డి తదితరులు మంగళవారం కదిరి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కడపల మోహన్ రెడ్డి ఇంటిలో సమావేశమై ఈ మేరకు తీర్మాణం చేసుకున్నట్లు అటు సోషల్ మీడియాలోనూ ఇటు ఎలక్ట్రానిక్ మీడియాలోనూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వైసిపి శ్రేణుల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఎస్సీ నియోజకవర్గమైన మడకశిరలో సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ ఎం తిప్పేస్వామికి టికెట్ లేదని స్పష్టం చేసి ఆయన స్థానంలో సీఐగా ఉన్న శుభకుమార్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. అదేవిధంగా కదిరి, పెనుకొండ, హిందూపురం అసెంబ్లీస్థానాలకు, హిందూపురం లోకసభ స్థానానికి అభ్యర్థులను మార్పు చేస్తూ ఆమేరకు అధిష్టానం నిర్ణయం తీసుకొని సమన్వయకర్తలను నియమించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి పూర్తిస్థాయిలో అధిష్టానానికి మద్దతు లభించలేదు. ప్రధానంగా కదిరి నియోజకవర్గానికి సంబంధించి కొంతవరకు సమస్య సద్దుమణగగా, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లో ఆశించిన స్థాయిలో అధిష్టానానికి మద్దతు లభించలేదని చెప్పవచ్చు. ఉమ్మడి అనంతపురం అదేవిధంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శ్రీ సత్య సాయి జిల్లా పర్యటనకు వచ్చి జిల్లాలో మకాం వేసినప్పటికీ వ్యతిరేకత, అసమ్మతి నాయకులు పక్కచూపులు జరుగుతుండటం గమనార్హం. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల ఇటీవలే కాంగ్రెస్‌లో చేరడం పట్ల ఎపిలో ఒక కుదుపు కలిగిందని చెప్పవచ్చు. వైఎస్ షర్మిలకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వ బాధ్యతలను జాతీయ నాయకత్వం అప్పగిస్తే రాష్ట్రంలో సంచనాలు జరుగుతాయని భావించవచ్చు. ఆమె కాంగ్రెస్‌లోకి చేరిన కారణంగానే ఇప్పటికే రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో అసమ్మతి నాయకులు బయటకు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అసమ్మతి వాదులు అందరూ కూడా షర్మిల వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది.

మంత్రి కాన్వాయ్ అడ్డగింత

ప్రజాశక్తి-హిందూపురం

ఎంతో చరిత్ర కలిగిన హిందూపురం పార్లమెంట్ కేంద్రంలో నేటికీ ప్రభుత్వ విద్యాసంస్థలు లేక పేద, బడుగు, బలహీన వర్గాల వారు చదువును కొనాల్సిన పరిస్థితి ఉందని, ఈ పరిస్థితుల్లో స్థానికంగా ప్రభుత్వ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు బాబావలి, ఎఐఎస్ఎఫ్ చంద్రశేఖర్ రెడ్డిలు కోరారు. ఈ మేరకు మంగళవారం నాడు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో విద్యార్థి సంఘ నాయకులు పోలీసులతో తాము మంత్రిని అడ్డుకోవడానికి రాలేదని, ప్రభుత్వ కళాశాలలను ఏర్పాటు చేయాలని వినతిని ఇవ్వాడానికి వచ్చామని తెలిపారు. దీంతో పోలీసులు పూలకుంట వద్ద జరుగుతున్న సమావేశం వద్దకు వామపక్ష విద్యార్థి సంఘం నాయకులను తీసుకెళ్లారు. విద్యార్థి సంఘం నాయకులు మంత్రిని కలిసి వినతిని అందించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డితో మాట్లాడుతూ పట్టణంలో ప్రభుత్వ కళాశాలలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో డిగ్రీ కళాశాలను ప్రారంభించారన్నారు. ప్రిన్సిపల్, అధ్యాపక పోస్టులు భర్తీ చేయక పోవడంతో అది మూతబడిందన్నారు. వెంటనే అధ్యాపక పోస్టులను భర్తీ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు నరసింహమూర్తి, తరుణ్, దేవరాజు, బాబా ఫకృద్దీన్, పవన్ కుమార్ పాల్గొన్నారు.



మంత్రికి వినతిని అందిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు

తహశీల్దార్ కార్యాలయం ఎదుట మహిళా రైతు ఆత్మహత్యాయత్నం



తహశీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులు

ప్రజాశక్తి ముదిగుబ్బ

తనకు ప్రభుత్వం అందించిన భూమిని ఇతరుల పేరిట నమోదు చేశారని తమకు న్యాయం చేయాలని ఓ మహిళా రైతు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చుట్టుప్రక్కల వారు సకాలంలో స్పందించి ఆమెను రక్షించారు. ఈ ఘటనకు సంబందించి బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలు... ముదిగుబ్బ మండలం కొడవండ్లపల్లి గ్రామానికి చెందిన చింతలరాయుడుకు ఐదు ఎకరాల డి పట్టా భూమికి గతంలో ప్రభుత్వం పట్టా మంజూరు చేసింది. అప్పటి నుంచి ఆ కుటుంబం ఆ భూమిని సాగుచేసుకుంటూ జీవనం చేస్తోంది. కాలక్రమేణ చింతలరాయుడు కుమారుడు నారాయణస్వామి, కోడలు ఆదిలక్ష్మి ఆ భూమిని సాగు చేసుకుని జీవనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని సంవత్సరాల క్రితం జీవనోపాధి నిమిత్తం నారాయణస్వామి, ఆదిలక్ష్మి వలస వెళ్లారు. ఆ సమయంలో ఆ భూమిని అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన పేరిట రికార్డులలో నమోదు చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న నారాయణస్వామి, ఆదిలక్ష్మి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి తిరిగి ఆ భూమిని తమ పేరుమీద నమోదు చేయించుకున్నారు. ఇలాగే మరోసారి కూడా ఆ వ్యక్తి తన పేరిట భూమిని నమోదు చేయించుకోవటంతో తిరిగి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఆ పేరు తొలగింపజేయించుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మూడవసారి తమ భూమిని అదే వ్యక్తి పేరిట నమోదు చేయడంతో బాధితులు స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి మంగళవారం వచ్చారు. ఈసందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఎక్కడి అధికారులు సక్రమంగా స్పందించకపోవడంతో తన భార్య ఆందోళనతో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని బాధితుడు నారాయణస్వామి తెలిపారు. తాము ఫిర్యాదు చేసిన సమయంలో తొలగించడం కొద్ది కాలానికి తిరిగి నమోదు చేయడం లాంటివి చేస్తున్నారని విమర్శించారు. భూమికి సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని అన్నారు. ఎలాంటి ఆధారం లేని వ్యక్తి పేరును పదేపదే రికార్డులలో నమోదు చేస్తున్నారని విమర్శించారు. సంబంధిత భూమి ఎవరికి చెందినదో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు, ఈ విషయంపై తహశీల్దార్ నాగేంద్రను వివరణ కోరగా వెంగముని అనే వ్యక్తి ఆన్లైన్లో భూమి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఈ విషయం తమ దృష్టికి రాలేదని అన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈ విషయమై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. భూమి యజమానిని గుర్తించి వారికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

అంగన్వాడీల సమస్యలు పట్టవా..?



ధర్మవరంలో అంగన్వాడీల పొర్లు దండాలు



కదిరిలో చెవిలో పూలుపెట్టుకుని అంగన్వాడీల నిరసన

ఓబుళదేవర చెరువు : తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన నిరసన కార్యక్రమం మంగళవారానికి 28వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా అంగన్వాడీలు చేతులెత్తి మొక్కుతూ తమ సమస్యలు తీర్చాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు లక్ష్మీనారాయణ, శ్రీరాములు, కుళ్లాయప్ప, అంగన్వాడీ యూనియన్ ఆశీర్వాదమ్మ, వరలక్ష్మి, మణిమాల, కిష్టమ్మ, వరలక్ష్మి, కమలమ్మ, అరుణమ్మ, సరళమ్మ. పద్మావతమ్మ, లక్ష్మీదేవి, కిష్టమ్మ, పద్మావతి, అశ్వనమ్మ, మినీ వర్కర్లు కమలమ్మ, శశికళ కుమారి పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల కేంద్రంలో అంగన్వాడీలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసనలు తెలిపారు ఈ సందర్భంగా అంగనవాడి యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సుజాత, భారతి మాట్లాడుతూ 29 రోజుల నుంచి నిరసనలు చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్ని జీవోలు పెట్టిన తమ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాలు ఆగవని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

కదిరి టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 29వ రోజుకు చేరుకుంది. మంగళవారం అంగన్వాడీలు చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ అంగన్వాడీ సెంటర్లకు వెళ్లిగోడలకు నోటీసులు అంటించడం చాలా దారుణం అన్నారు. ప్రభుత్వం మొండి వైఖరికి అదే స్థాయిలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మాబున్నీసా, చంద్రకళ, లక్ష్మీదేవి, సుజాత, సరోజ, సువర్ణ, శారదా, సిఐటియు నాయకులు జిఎల్ నరసింహులు, జగన్మోహన్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : అంగనవాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎన్ని జీవోలు తెచ్చినా భయపడే ప్రసక్తి లేదని తెగేసి చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీలు తమ నిరసన మంగళవారం కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహప్ప, ధనమ్మ, గౌరమ్మ, శ్రీదేవి, రూప, పార్వతి పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీలు పొర్లు దండాలు పెడుతూ నిరసన చేశారు. 29 రోజులుగా అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే వారి సమస్యలను పరిష్కరించకపోగా వారిపై కక్షసాదింపుచర్యలకు ప్రయత్నించడం అన్యాయమని సిఐటియు నాయకులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఎల్ ఆదినారాయణ, కార్యదర్శి అయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : అంగన్వాడీల సమ్మె 29వ రోజుకు చేరింది. తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో చేపట్టిన సమ్మెలో సిఐటియు మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, బండల వెంకటేశు, ప్రజానాట్యమండలి నాయకుడు బాబు, మధుసూదన్ రెడ్డి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి కదిరి అర్బన్

పనికి తగ్గ వేతనం అందించాల్సిన ప్రభుత్వం తమను పట్టించుకోలేదని మున్సిపల్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె నిర్వహించారు. నుదుట నామాలు పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) యూనియన్ జిల్లా కోశాధికారి ఎస్. తిరుపాల్, అధ్యక్షులు జనార్దన్, కార్యదర్శి బాలకృష్ణ, ట్రెజరర్ సూరి, రామాంజులు, రాజు, నరసింహ మూర్తి, రాజేష్, చెన్నకృష్ణ, సిఐటియు నాయకులు జగన్మోహన్, బాబ్జాన్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 15వ రోజుకు చేరుకుంది. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు దీక్షలో కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ తాము చేపట్టిన సమ్మె 15 రోజులు అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలనే తాము అడుగుతున్నామన్నారు. ప్రభుత్వం దిగురాకుంటే తమ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగార్జున, రామయ్య, పెద్దన్న, గోవిందు, పోతులయ్య, నరసింహులు, సరోజమ్మ, మారక్క తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : సమస్యల పరిష్కారం కోసం నగర పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ యూనియన్ చిన్న వెంకటేష్, రిక్షా నరసింహులు, ముత్యాలు, నరసింహప్ప, తిప్పన్న,లక్ష్మీదేవి, వెంకటేష్ కార్మికులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని సిఐటియు మండల కార్యదర్శి అయూబ్ఖాన్ హెచ్చరించారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 15వ రోజు కొనసాగింది. ఈ సమ్మెలో పంగనామాలు పెట్టుకుని గోవిందనామస్మరణ చేస్తూ నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలా లక్ష్మీనారాయణ, పెద్దక్క, వెంకటేశులు, చెన్నకేశవులు, లక్ష్మీఓబుళేశు,ప్రసాద్, ముకుందా, అద్రామహేశ్, బొగ్గునాగరాజు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో సమ్మెలో మున్సిపల్ కార్మికులు



పెనుకొండల సమ్మెలో పాల్గొన్న కార్మికులు, నాయకులు



ధర్మవరంలో కార్మికుల వినూత్న నిరసన

11న మండల మీట్

కొత్తచెరువు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 11న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ బారాన్‌సాహెబ్ తెలిపారు. ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, ఆయా శాఖల అధికారులు, సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

'జై భీమ్ పార్టీ తరపున బరిలో ఉంటా'

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జై భీమ్ పార్టీ తరపున తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు గుమ్మగట్ట ఈశ్వరయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం మాట్లాడుతూ జైభీమ్ దళిత ఆశాజ్యోతి, ప్రపంచ మేధావి అని అన్నారు. ఆయన పేరుతో జై భీమ్ అనే పార్టీతో ముందుకొచ్చిన హైకోర్టు ప్రముఖ మాజీ జడ్జి శ్రావణ్ కుమార్ ఆదర్శనీయుడన్నారు. శ్రావణ్ కుమార్ త్వరలో జిల్లా పర్యటనకు రానున్నారని గుమ్మగట్ట ఈశ్వరయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే చేపట్టామన్నారు.

ఉచిత వైద్యశిబిరం

హిందూపురం : హిందూపురం రూరల్ మండలం చౌళూరు పంచాయితీ పరిధిలోని కారుడిపల్లి గ్రామంలో మంగళవారం వాసవ్య మహిళా మండలి, విప్రో కేర్ సహకారంతో కుశాల్ హెల్త్ కేర్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 109 మంది రోగులను పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన మందులను అందించారు. అలాగే 3నుండి 5సంత్సరాల పిల్లలకు స్పైరులీనా చిక్కి అందచేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గౌతమి, కుశాల్ ప్రాజెక్టు సిబ్బంది మల్లేశ్వరి, కృష్ణవేణి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

పెనుకొండ : మండలంలోని మావటూరు గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను వైసిపి సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. పోటీల విజేతకు రూ. 50వేలు, రెండవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ 25వేల బహుమతిని సుధాకర్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామీణ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నాగరాజు, ఎంపీటీసీ శివయ్య, వైసిపి నాయకులు ఈదులబలాపురం నాగభూషణ్ రెడ్డి, సుగుణాకర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి వైసిపి నాయకులు

కదిరి అర్బన్ : పట్టణానికి చెందిన పలువురు వైసిపి నాయకులు కాంగ్రెస్‌లోకి చేరారు. పట్టణంలోని 11 వ వార్డుకి చెందిన అల్లాబకష్ తో పాటు వైసీపీకి చెందిన కొన్ని కుటుంబాల సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా షానవాజ్ మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల నుండి రాష్ట్రంలో, దేశంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని కోల్పోయి అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అష్రఫ్, డిసిసి ప్రధాన కార్యదర్శి అమీర్ సాబ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు నిలోఫర్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు షౌకట్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునికుమార్, ఇర్ఫాన్, నాగేంద్ర, అక్రమ్, అస్లం తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణను కలిసిన నాయీబ్రాహ్మణ సంఘం కన్వీనర్

మడకశిర : హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణను నాయి బ్రాహ్మణ సాధికారిక కన్వీనర్ రామాంజనేయులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నాయీ బ్రాహ్మణుల పరిస్థితులపై ఎమ్మెల్యేకు వివరించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

కొత్తచెరువు : గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమా గ్రంథాలయ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆమె కొత్తచెరువులోని శాఖ గ్రంథాలయాన్ని మంగళవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు జయరాం, ఆంజనేయులు, సాలెం రాజు, అటెండర్ మునీరు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో అర్హులందరికీ సంక్షేమం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

బిసిల పార్టీ అంటు చెప్పుకునే టిడిపి ఏ నాడు బిసిలను గుర్తించలేదని....బిసిలను గుర్తించి వారికి అండగా నిలచిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కిందని మంత్రి పెదిరెడ్డి రామచంద్రా రెడ్డి అన్నారు. మంత్రి రెండో రోజు పర్యటనలో భాగంగా మంగళవారం రూరల్ మండలంలో పూలకుంట, కగ్గల్లు, మణేసముద్రం, మలగూరు, ఎం బీరేపల్లి, చెలివెందుల, బాలంపల్లి పంచాయితీల్లో జరిగిన సమావేశాల్లో పార్లమెంట్ ఇన్‌ఛార్జి శాంతమ్మ, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపికతో కలిసి మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెలివెందుల గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశాల్లో మంత్రి మాట్లాడుతు సచివాలయ వ్యవస్థతో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించామన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు, ఆయన బావమర్ది బాలకృష్ణ, బాబు తనయుడు లోకేష్ అమలకు సాధ్యం కాని హామీలతో ముందుకు వస్తారని, నమ్మి ఎవరు మోసపోవద్దని కోరారు. నిత్యం అందుబాటులో ఉండే నాయకులను ఎన్నుకుంటే ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ రెడ్డిఈశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, వైసిపి నాయకురాలు మధుమతి రెడ్డి, జ్యోష్ణరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మేన్ బలరామిరెడ్డి, ఎంపిపి రత్నమ్మ, జెడ్పీటీసీ నాగభూషణప్ప, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రాచపల్లి మహేందర్ నాథ్ రెడ్డి, మండల కన్వీనర్ రాము, హనుమంతరెడ్డి, నక్కలపల్లీ శ్రీరామ్ రెడ్డి, సర్పంచ్ ఉపేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది మన ప్రభుత్వమే..ధైర్యంగా ఉండండి...

ఎమ్మెల్యే బాలకృష్ణ



సమీక్షా సమావేశంలో నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

త్వరలో జరిగే ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాలను గెలచి...అధికారంలోకి వస్తామని, ప్రతి కార్యకర్త, నాయకులు ధైర్యంగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ భరోసా కల్పించారు. ఈ మేరకు ఆయన మంగళవారం పట్టణంలోని జెవిఎస్ ఫక్షన్ హాల్‌లో పురపాలక సంఘం వ్యాప్తంగా ఉన్నా పలు వార్డుల నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. టిడిపి అధికారంలోకి తప్పక వస్తుందని జోస్యం చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని ప్రాంతాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గత ఎన్నికల కంటే అత్యదిక మెజార్టీతో విజయం సాధించే విధంగా రెట్టింపు ఉత్సహంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



'బ్లూమూన్' అధినేతకు పార్టీ కండువా కప్పుతున్న పవన్‌కళ్యాణ్

జనసేనలో చేరిన 'బ్లూమూన్' అధినేత

ప్రజాశక్తి, కదిరి టౌన్

స్థానిక బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత మంచి శివశంకర్ జనసేన పార్టీలో చేరారు. ఈ మేరకు మంగళగిరి లోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలోకి చేరారు. ఆయనతో పాటు అఖిల భారత కాపు సమాఖ్య అధ్యక్షులు గవ్వల శ్రీనివాసులు, చిన్నపరెడ్డి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ వారికి పార్టీ కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రముఖులు జనసేన పార్టీలోకి చేరారు. ఈ మేరకు పార్టీ అభివృద్ధికి పాటుపడాలని పవన్‌కళ్యాణ్ వారికి సూచించారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న పవన్ కళ్యాణ్ చొరవ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై జనసేన పార్టీలోకి చేరినట్లు బ్లూ మూన్ విద్యాసంస్థల అధినేత మంచి శివశంకర్ తెలిపారు. తనవంతుగా పార్టీ అభివృద్ధికి పాటుపడతానని ఆయన చెప్పారు.

కంది కొనుగోలుకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో కంది పంట సాగుచేసిన రైతుల నుండి పంట కొనుగోలు చేసేందుకు కనీస మద్దతు ధర నిర్ణయించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అగ్రి బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, పౌర సరఫరాల శాఖ మేనేజర్ అశ్వర్ధ నాయక్, డిఎస్ఒ వంశీకృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, మార్కెటింగ్ ఎడి మూర్తి తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కందులు పండించిన రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి వారి నుంచి కందులు సేకరించాలన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ద్వారా వీటిని కొనుగోలు చేయాలన్నారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులు మోసపోకుండా కనీస మద్దతు ధర పొందే విధంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాలు ద్వారా కందులు కొనుగోలు చేయాలని రైతు భరోసా అధికారులకు ప్రభుత్వ నిబంధనలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

నిరుపేదలకు మెరుగైన వైద్యం

మడకశిర : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నిరుపేదలకు మెరుగైన వైద్యం సకాలంలో అందుతుందని డిప్యూటీ డిఎంహెచ్ఒ మంజువాణి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఆర్. అనంతపురం గ్రామం లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని తనికీ చేశారు. వైద్యసేవలపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధుర్యను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, ఎంపిడిఒ సోనియాబాయి, కల్లుమర్రి ఆరోగ్య కేంద్రం ఆరోగ్య సిబ్బంది రాంప్రసాద్, శేషు, చెన్నకేశవరెడ్డి, రాధమ్మ, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్టు

కదిరి టౌన్ : కదిరి పట్టణంలో ఆదివారం జరిగిన హత్యాయత్నం కేసుకు సంబందించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. మోటర్ సైకిల్ మెకానిక్ గా పని చేస్తున్న మారుతి నగర్‌కు చెందిన శ్రీధర్‌పై పూలబజార్ కు చెందిన బాలు ఆలియాస్ బాల మురళీకృష్ణ, పవన్ ఆలియాస్ సుదర్శన్, షేక్ ఇసాక్ దాడి చేసి హత్యకు కుట్రకు పన్నారని బాధితుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు నిందితులను కోర్టులో హాజరుపరచగా కోర్టు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

మద్యం రవాణాకు అడ్డుకట్ట

పుట్టపర్తి రూరల్ : అక్రమ మద్యం, నాటు సారా రవాణాకు శ్రీ సత్యసాయి జిల్లా సెబ్ అధికారులు అడ్డుకట్ట వేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ధర్మవరం సెబ్ స్టేషన్ పరిధి లో బత్తలపల్లి మండలం లో ఒక వ్యక్తి నుంచి ఆరు లీటర్లు నాటుసారాయిని స్వాధీన పరుచుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సికె.పల్లి సెబ్ స్టేషన్ పరిధిలో యలకుట్ల గ్రామా పరిసర ప్రాంతాలలో 110 లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పెనుకొండ సెబ్ స్టేషన్ పరిధిలో ఒక ఎన్‌డిపిఎల్ కేసు నమోదు చేసి 20 కర్నాటక మద్యం పాకెట్లు స్వాధీనపరుచుకున్నారు. హిందూపురం స్టేషన్ పరిధి లో ఒక ఎన్‌డిపిఎల్ కేసు నమోదు చేసి 30 కర్నాటక మద్యం పాకెట్లు స్వాధీనపరుచుకున్నారు. పుట్టపర్తి సెబ్ స్టేషన్ పరిధిలో ఒక ఎన్‌డిపిఎల్ కేసు నమోదు చేసి 27 కర్నాటక మద్యం పాకెట్లు స్వాధీనపరుచుకున్నారు. నిందితులను ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో అప్పగించినట్లు సెబ్ అధికారులు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

అమరాపురం : మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని డీఎస్పీ హుసేన్‌పీరా ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలని సూచించారు. అసంఘటిత కార్యక్రమాలకు తావు ఇవ్వకుండా గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఐ సురేష్‌బాబు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎఎస్ఐ రామాంజనేయులు, పోలీసులు పాల్గొన్నారు.

క్షమాభిక్ష కేసు కొట్టివేతపై హర్షం

మడకశిర : 2002లో బిల్కిస్ బానో మీద అత్యాచారం జరిపి, ఆమె కుటుంబ సభ్యులు14 మందిని హత్య చేసిన కేసులో శిక్ష పడిన 11 మంది దోషులు పెట్టుకున్న క్షమాభిక్ష కేసును కొట్టివేయడంపై డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంఆర్. హనుమంతు హర్షం వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జస్టిస్ బి వి నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల సుప్రీం కోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేశారు.

బీమా చెక్కు అందజేత

మడకశిర : నగర పంచాయతీ 7వ వార్డుకు చెందిన నాగరాజు రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో వారి కుటుంబానికి మంజూరైన వైఎస్ఆర్ బీమా చెక్కును మృతుని భార్య మంజులమ్మకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ కుమారుడు జయరాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ఓబుళపతి, నవీన్ కుమార్, శ్రావణ్, నాగేంద్ర, మారుతి, సన్నఅంజి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ బాలుర హాకీ జిల్లా జట్టు ఎంపిక

ధర్మవరం టౌన్ : హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 12వతేదీవరకు తిరుపతిలో జరిగే 14వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొనే జిల్లా హాకీజట్టును ఎంపిక చేసినట్టు ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రసిడెంట్, జిల్లా సెక్రటరీ బంధనాధం సూర్యప్రకాశ్ తెలిపారు. ఈ జట్టును ఈనెల 3వతేదీన స్థానిక బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ఎంపికచేశామన్నారు. లోకేశ్, మహమ్మద్‌రఫీ, జగన్, ఈశ్వర్, మహబూబ్ బాషా, బాల ఓబుళేశు, భరత్‌కుమార్, మనోజ్‌కుమార్, అభిషేక్, అనిల్‌కుమార్, దుర్గాప్రసాద్, లవన్ కుమార్. దయాసాగర్, ఫజులుద్దీన్, కబరీష్ గౌడ్, రితీష్, వెంకటఅభిషిక్త్, గవ్వలమధు జిల్లాజట్టుకు ఎంపికయ్యారన్నారు. జట్టు కోచ్‌గా హుస్సేన్, మేనేజర్‌గా షేక్షావలి, అంపైర్‌గా సాయికుమార్ వ్యవహరించనున్నట్లు ఆయన తెలిపారు.



జిల్లా జట్టుకు ఎంపికైన ధర్మవరం క్రీడాకారులు

ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆర్డీవో భాగ్యరేఖ ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో ఓటర్లుకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ద్వారా ఓటింగ్ ఎలా చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. ఇప్పటికే నల్లమాడ, కొత్తచెరువు గ్రామాలలో అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి బాలగంగాధర్, సిపిఎం పైపల్లి గంగాధర్, సిపిఐ అంజినేయులు, టిడిపి మనోహర్, జనసేన బొగ్గరం శ్రీనివాసులు, మారుతి, కూర్మనాథ్, నరసింహులు, ఎన్నికల డిప్యూటీ తహశీ ల్దార్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో

అంగన్వాడీల డిమాండ్లు న్యాయమైనవే



అంగన్వాడీల ఆందోళనలో పాల్గొన్న బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

అంగన్వాడీల డిమాండ్లు న్యాయమైనవే అని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. పట్టణంలోని సద్భవన్ సర్కిల్‌లో అంగన్వాడీలు, మున్సిపల్ కార్యలయం ఎదుట మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఎఐటియుసి ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నారు. కార్మికులు చేస్తున్న సమ్మెకు స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సమ్మె శిబిరంలో కార్మికులతో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల మ్యానిఫెస్టోలో తమ సమస్యలను చేర్చి, అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు, జిల్లా నాయకులు సాంబశివ, మున్సిపల్ యూనియన్ నాయకులు జగదీష్, ఎపి అంగన్ వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య కోరారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించడానికి చేతగాని ప్రభుత్వం మహిళలు అని కూడా చూడకుండా అంగన్వాడీలపై ఎస్మాను ప్రయోగించడం దుర్మార్గమన్నారు. తక్షణమే ఎస్మాను ఉపసరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులను భయపెట్టి, వేధించి, నిర్బంధ చర్యలకు పూనుకున్న ఏ ప్రభుత్వం, పాలకులు బతికి బట్ట కట్టలేదన్న వాస్తవాన్ని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం గ్రహించాలని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వీరి న్యాయమైన డిమాండ్లను పార్టీ అధ్యక్షులు చంద్రబాబుకు వివరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మినారాయణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రావెళ్ల లక్ష్మి, కౌన్సిలర్లు రమేష్‌కుమార్, రాఘవేంద్ర, సతీష్ కుమార్, టిడిపి నాయకులు, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు, కార్మికులు, అంగన్వాడీ యూనియన్ నాయకులు శిరీషా, శైలజ, వరలక్ష్మితో పాటు పెద్ద ఎత్తున కార్మికులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పెనుకొండ : అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం జగన్ రెడ్డి అరాచక పాలనకు పరాకాష్ట అని టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి విమర్శించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు..తక్షణమే జీవో 2 వెనక్కు తీసుకోవాలని ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. 29రోజుల సమ్మె తర్వాత అత్యవసర సేవలని గుర్తించారా అని ప్రశ్నించారు. సమ్మె నోటీసు ఇచ్చినపుడు ఎందుకు పట్టించుకోలేదన్నారు. అత్యవసర సేవలు అందించే వారికి కనీస వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వానికి తెలీదా అని అన్నారు. అంగన్వాడీల సమస్యలపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్ చేశారు.